సాక్షి
కుమురం భీం

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



కొరవడిన పర్యవేక్షణ!
జన్నారం అటవీ డివిజన్‌లో పర్యవేక్షణపై కరువైంది. అధికారులు సీసీటీవీ ఫుటేజీలను పర్యవేక్షించకపోవడంతో సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. 8లో▸



డబుల్ రోడ్డుకు గ్రహణం..!
కోశ్మీర్ నుంచి దహెగాం వరకు ఉన్న సింగిల్ రోడ్డంతా గుంతలమయంగా మారింది. నిధులు మంజూరైనా డబుల్ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.5 /24.1

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సివిల్ సప్లై అధికారికి షోకాజ్ నోటీసు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో అలసత్వం ప్రదర్శించిన జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి వినోద్‌కుమార్‌కు బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే షోకాజ్ నోటీసు జారీ చేశారు. మంగళ, బుధవారాల్లో అధికారికంగా నిర్వహించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడంపై రెండు రోజుల్లో వివరణ ఇవ్వని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కౌటాల డిప్యూటీ తహసీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

చింతలమానెపల్లి(సిర్పూర్): కౌటాల డిప్యూటీ తహసీల్దార్(డీటీ)గా విధులు నిర్వర్తిస్తున్న మష్కూర్ అలీపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మార్చి 29న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో చింతలమానెపల్లి తహసీల్దార్‌గా మష్కూర్ అలీ పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేశారు. 2023 జూన్‌లో బాలాజీ అనుకోడ శివారులోని 65/193/3 సర్వే నంబర్‌లో గల భూమిని అక్రమంగా బదలాయించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. నీలం అశోక్‌కు చెందిన భూమిని కామ్రె రేవాబాయికి అక్రమంగా పట్టా చేశారనే ఆరోపణలపై అసైన్డ్ ల్యాండ్స్ చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యత

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసుశాఖ తొలిప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. షీటీం, భరోసా కేంద్రాల ద్వారా నిరంతరం చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థులు హింసకు గురైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మార్చిలో షీటీం ఆధ్వర్యంలో 74 హాట్‌స్పాట్ ప్రదేశాలను సందర్శించి 13 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్

పెంచికల్‌పేట్(సిర్పూర్): అర్హులు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. మండలంలోని లోడుపల్లి గ్రామంలో బుధవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు అర్హులను ఎంపిక చేయడంలో క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన వారికి పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై కొముురయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) మండలంలో..

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలోని పేట్‌మహెలా కాలనీ, గోవింద్‌పూర్ కాలనీలోని రేషన్ దుకాణాల్లో బుధవారం ఎమ్మెల్సీ దండె విఠల్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారులు సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

ఆసిఫాబాద్: ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 30 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ లేఅవుట్ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి 25 శాతం రాయితీతో మార్చి 31 వరకు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులపై జిల్లాలోని దరఖాస్తుదారులు ఆసక్తి చూపలేదు. జిల్లావ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ కింద మొత్తం 7,194 దరఖాస్తులు వచ్చాయి. 335 గ్రామ పంచాయతీల్లో 3,665 మంది దరఖాస్తు చేసుకోగా, 667 మంది మాత్రమే ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 1,649 మంది దరఖాస్తు చేసుకోగా, 120 మంది ఫీజు చెల్లించారు. ప్రభుత్వానికి రూ.62 లక్షలు ఆదాయం సమకూరింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 1,880 దరఖాస్తులకు 235 మంది ఫీజు చెల్లించారు. రూ.94 లక్షల ఆదాయం సమకూరింది.

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన రాజు మార్చి 23న వాట్సాప్‌లో ఓ బ్యాంకు క్రెడిట్ కార్డు దరఖాస్తు పేరిట వచ్చిన లింకును క్లిక్ చేశాడు. అందులో అడిగిన ఆధార్, పాన్, ఉద్యోగం, వ్యాపారం తదితర వివరాలు నమోదు చేశాడు. అనంతరం వెరిఫికేషన్ పేరిట ఓ వ్యక్తి వీడియోకాల్ చేసి నమోదు చేసిన వివరాలు సరిచూసుకోవాలని చెప్పాడు. మళ్లీ ఓ లింకు వస్తుందని, దానిని క్లిక్ చేసి ఓటీపీ చూపించమని కోరాడు. ఓటీపీలు చూపించిన వెంటనే రాజు క్రెడిట్ కార్డు నుంచి రూ.44వేలు, బ్యాంకు ఖాతా నుంచి రూ.14 వేలు విత్‌డ్రా అయ్యాయి. అప్రమత్తమైన అతడు హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయగా.. మార్చి 24న ఉదయం రూ.21 వేలు తిరిగి వచ్చాయి.

చింతలమానెపల్లి మండలం దబ్బా గ్రామానికి చెందిన యువకుడి ఫోన్‌కు కారు లక్కీలాటరీ వచ్చిందని వాట్సాప్‌లో మెసేజ్ వచ్చింది. మెసేజ్ వచ్చిన నంబర్‌కు యువకుడు ఫోన్ చేయగా మీపేరు మీద రూ.15 లక్షల కారు లాటరీ వచ్చిందని, వీడియో కాల్‌లో కొత్త కారును యువకుడికి చూపించారు. వెంటనే రూ.50 వేలు చెల్లిస్తే కారు మీ అడ్రస్‌కు పంపిస్తామని ఆశ చూపారు. ఫోన్‌పే ద్వారా సదరు వ్యక్తి నంబర్‌కు రూ.50 వేలు పంపించగా.. మీకు కారు పంపించడానికి ధ్రువీకరణ పత్రాలు, రవాణా, ఇతర ఖర్చులు కోసం డబ్బులు పంపించాలని సూచించారు. ఆ యువకుడు విడతల వారీగా రూ.7 లక్షల వరకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా పంపించాడు. కొన్ని రోజుల తర్వాత సదరు వ్యక్తికి కాల్ చేస్తే స్పందించకపోవడంతో మోసపోయాయని గ్రహించి యువకుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నమ్మిస్తూ.. దోచేస్తూ



- లింకులు, ఓటీపీలతో పెరిగిన సైబర్ మోసాలు
- రెచ్చిపోతున్న ఆన్‌లైన్ కేటుగాళ్లు
- అప్రమత్తత అవసరమంటున్న పోలీసులు

కౌటాల(సిర్పూర్): ఇది డిజిటల్ యుగం. ఉదయం నిద్ర లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయే వరకు ప్రతీ పని సాంకేతికతతో ముడిపడి ఉంటోంది. అరచేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ప్రపంచమే మన గుప్పిట్లో ఉన్నట్లు.. ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే. మరోవైపు సాంకేతికత ఆధారంగా మోసాలు పెరిగాయి. రోజుకో కొత్త తరహా మోసంతో బ్యాంకు ఖాతాలను కొల్లగొడుతున్నారు. అత్యాశ, అవగాహన లేకపోవడంతో ఏటా జిల్లాలో వందలాది మంది మోసపోతున్నారు.

ఆశ చూపి మోసాలు..

కొద్దరోజులుగా ఫోన్ నుంచి ఇతరులకు కాల్ చేస్తే 'జాగ్రత్త తెలియని నంబర్ నుంచి మీకు కాల్ చేసి మేము పోలీసులమని, బ్యాంక్ అధికారులమని మాట్లాడితే మీరు మోసపోకండి' అంటూ ఆన్‌లైన్ అరెస్టులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ విధంగా కాలర్ రింగ్‌టోన్ వస్తోంది. డిజిటల్ అరెస్టుల పేరుతో జరిగే మోసాలపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ఈ విధంగా ప్రచారం చేస్తోంది. పలు మార్గాల్లో అవగాహన కల్పిస్తున్నా ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట పడటం లేదు. జిల్లాలో 2023లో 34 కేసులు నమోదు కాగా, 2024లో 21 సైబర్ కేసులు నమోదయ్యాయి.

- క్రెడిట్ కార్డుల పేరిట ఓటీపీ పంపి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సొమ్మును అధికారిక వెబ్‌సైట్ తరహాలో లింకులు పంపి దోచుకుంటున్నారు.
- లాటరీ వచ్చిందని నగదు బహుమతి అందుకునేందుకు ఖర్చుల కింద కొంత నగదు కట్టాలంటూ మాయమాటలతో అమాయకుల నుంచి రూ.లక్షలు లాగేస్తున్నారు.
- సైబర్ నేరగాళ్లు బాధితుల ఫోన్‌పే, ఇతర యూపీఐ యాప్‌లకు ముందుగా కొంత డబ్బు పంపి.. తెలియకుండా మీ నంబర్‌కు మా డబ్బులు వచ్చాయని తిరిగి పంపించాలని కోరుతున్నారు. సదరు వ్యక్తి ఎవరో గ్రహించకుండా తిరిగి ఆ నగదును పంపిస్తే వెంటనే ఖాతాలోని మిగిలిన మొత్తం కూడా ఖాళీ అవుతోంది.
- సోషల్ మీడియాలోని ఫొటోలను మార్ఫింగ్ ద్వారా అసభ్యంగా మార్చి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. అలాగే అసభ్యకరమైన కామెంట్లు చేయడం, ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేసి ప్రేమ వ్యవహారంతో నమ్మించి వంచిస్తున్నారు.
- నిషేధిత యాప్‌ల్లో డబ్బులు రెట్టింపు వస్తాయనే ఆశతో యువత ఎక్కువగా మోసపోతున్నారు.
- వాట్సాప్‌లో గుర్తుతెలియని నంబర్లతో న్యూడ్ వీడియోకాల్ చేసి రికార్డింగ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ప్రజాప్రతినిధులకు ఇలాంటి వేధింపులు ఎక్కువయ్యాయి.
- సైబర్ మోసాలకు గురవుతున్న వారిలో విద్యావంతులతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య రైతులు, సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉండే వారే అధికంగా ఉంటున్నారని అధికారులు పేర్కొంటున్నారు.

అప్రమత్తత అవసరం..

మార్కెట్లలోని షాపులు, షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాల్లో మనం ఇచ్చే ఫోన్ నంబర్, సోషల్ మీడియాలో సమాచారం సైబర్ మోసగాళ్లు అనువుగా మార్చుకుంటున్నారు. ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్‌నగర్ పట్టణాల్లోని యువకులు అవగాహన ఉండి కూడా మోసాలకు గురవుతున్నారు. మరోవైపు మారుమూల మండలాలు బెజ్జూర్, చింతలమానెపల్లి, లింగాపూర్, తిర్యాణి ప్రాంతాల్లోని ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో సైబర్ నేరాలు గురవుతున్నారు. సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువ కావడంతో జిల్లా వ్యాప్తంగా ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్‌తో సైబర్ వారియర్స్ ఏర్పాటు చేశారు. బాధితులు నేరుగా వారిని సంప్రదించవచ్చు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. ఆర్థిక మోసాలు, చిన్నారులు, మహిళలు, ఇతర సైబర్ నేరాలకు సంబంధించి వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఆర్థిక మోసాలకు సంబంధించి ఫిర్యాదు చేసే సమయంలో సంబంధిత బ్యాంకు /వాలెట్, లావాదేవీకి సంబంధించి 12అంకెల ఐడీ/యూటీఆర్ నంబర్, మోసం జరిగిన తేదీ, ఎంత మొత్తం, ఇందుకు అవసరమైన సాఫ్ట్‌కాపీ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. http://www.cybercrime.gov.in వైబ్‌సైట్ ద్వారా, లేదా 1930 నంబరుకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దు



జిల్లాలో కొద్దిరోజులుగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. మోసపూరిత ప్రకటనలు, ఆన్‌లైన్‌లో డబ్బులు ఎక్కువ ఇస్తామంటే నమ్మొద్దు. అనుమానిత నంబర్ల నుంచి వచ్చే లింక్‌లు ఓపెన్ చేయవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దు. సైబర్ నేరానికి గురై నగదు పోగొట్టుకుంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్, సైబర్ క్రైం హెల్ప్‌లైన్ 1930కి ఫోన్ చేయాలి. సంబంధిత ఖాతా నుంచి నగదు విత్‌డ్రా కాకుండా చూస్తాం. లాటరీ విధానం కూడా నిషేధంలో ఉంది. కొత్త రకం మోసాలపైనా నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలు కొనసాగిద్దాం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు, నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలు కొనసాగిద్దామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు, గౌడ సంఘం, ఇతర సంఘాల నాయకులతో కలిసి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ 17వ శతాబ్దంలో పాపన్నగౌడ్ కులవృత్తి చేసుకుంటూనే తరుష్క, మొగల్ సైనికుల ఆగడాలను ఎదిరించారని తెలిపారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వం పాపన్నగౌడ్ పేరుతో పోస్టల్ కవర్ విడుదల చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ జిల్లా అధికారి సజీవన్, డీపీవో భిక్షపతి గౌడ్, గౌడ సంఘం నాయకులు బాలేష్‌గౌడ్, రాధాకృష్ణగౌడ్ (బాబుగౌడ్), బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం



ఆహ్వానపత్రం ఇస్తున్న నిర్వాహకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో ఈ నెల 6న నిర్వహించే సీతారాముల కల్యాణానికి హాజరు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, శైలు, యాదగిరి, నాగరాజు ఆహ్వానపత్రిక అందించారు. అలాగే జిల్లా కేంద్రంలో ఈ నెల 11న నిర్వహించే వీరహనుమాన్ శోభాయాత్రకు హాజరు కావాలని హనుమాన్ భక్తులు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఏఎస్పీ చిత్తరంజన్‌ను ఆహ్వానించారు.

యువ వికాసంపై ప్రచారం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: రాజీవ్ యువవికాసం పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి బుధవారం మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. వెనుకబడిన తరగతులకు చెందిన యువత ఈ నెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా యూనిట్లు ఎంపిక చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యం చేయొద్దని తహసీల్దార్లను ఆదేశించారు. రేషన్‌కార్డులు ఉన్నవారికి ఆదాయ ధ్రువపత్రం అవసరం లేదని స్పష్టం చేశారు. యూనిట్ల వివరాలు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీటీడీవో రమాదేవి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సజీవన్, లీడ్ జిల్లా మేనేజర్ రాజేశ్వర్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలు వందశాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పంచాయతీరాజ్ ఈఈ, డీఈఈ, ఏఈఈలతో పనుల పురోగతి, ఎంబీ రికార్డులపై సమీక్షించారు. పూర్తయిన పనుల ఫొటోలు, వివరాలతో ఎంబీ రికార్డులు సిద్ధం చేసి ఈ నెల 5లోగా సమర్పించాలన్నారు. డీఆర్‌డీవో దత్తారావు, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: మహనీయుల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం అంబేడ్కర్ యువజన సంఘం నాయకులతో కలిసి అంబేడ్కర్ జయంతి పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్, 14న అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఇందులో భాగంగా విగ్రహాలు అలకరించి, వేదికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహనీయులు దేశానికి అందించిన సేవలు భావితరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, నాయకులు సుభాష్, తుకారాం, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మొక్కలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కెరమెరి(ఆసిఫాబాద్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని కొఠారి గ్రామంలో బుధవారం జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణతో కలిసి పర్యటించారు. అనేక మంది ఇప్పటికీ కనీసం గుంతలు కూడా తవ్వకపోవడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే నిర్మాణాలు ప్రారంభించాలని, దశలవారీగా బిల్లులు అందుతాయని తెలిపారు. అనంతరం నర్సరీని తనిఖీ చేశారు. ఎండల నేపథ్యంలో మొక్కల రక్షణకు గ్రీన్‌నెట్ ఉపయోగించాలని సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలించారు. మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఝరి, కొఠారి గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, డీటీ సంతోష్‌కుమార్, నాయకులు మునీర్ అహ్మద్, కోవ ఇందిర తదితరులు ఉన్నారు.

పోడు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీకి సమస్యలు వివరిస్తున్న రైతులు

బెజ్జూర్(సిర్పూర్): సిర్పూర్ నియోజకవర్గంలోని పోడు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని చిన్నసిద్దాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ రైతులు వారి సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్లుగా భూములు సాగు చేస్తున్నామని, 2017లో భూప్రక్షాళన సర్వేలో ప్రభుత్వం అసైన్డ్ పట్టా పాస్‌పుస్తకాల వివరాలు నమోదు చేసిందని తెలిపారు. ఇప్పటివరకు పాస్‌బుక్‌లు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. అటవీశాఖ అధికారులు పాస్ పుస్తకాలు రాకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, అటవీ శాఖలు ఉమ్మడి సర్వే చేసి, పట్టాలు జారీ చేయాలని కోరారు. సీసీ రోడ్లు మంజూరు చేయాలని విన్నవించారు. అనంతరం మండల కేంద్రంతోపాటు కృష్ణపల్లి, సలుగుపల్లి గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులకు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాశ్, మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు బుస శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజారాం, టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్, మాజీ సర్పంచులు కొండ్ర జగ్గాగౌడ్, లింగయ్య, విశ్వేశ్వర్, ఉమామహేశ్, సురేశ్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోడేఘాట్ నుంచి యాత్ర ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని కుమురం భీం పోరుగడ్డ జోడేఘాట్ నుంచి జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ యాత్రను బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్, రాజ్యాంగం విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రాజ్యాంగాన్ని మార్చుతామని బీజేపీ ప్రకటించడం అంబేడ్కర్‌ను అవమానించడమే అవుతుందన్నారు. అంతకు ముందు కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు ఆత్రం కుసుంబ్‌రావు, మునీర్ అహ్మద్, వసంత్‌రావు, న్యానేశ్వర్, జలపతి రావు, కుత్బొద్దీన్, ఇందిరా, తిరుపతి, విశ్వనాథ్, పాలక్‌రావు, భీంరావు, రవి, సిరాజ్, ముజ్జు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు



జిల్లా కేంద్రంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మార్చి 21న పరీక్షలు ప్రారంభం కాగా, జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాటు చేశారు. చివరిరోజు పరీక్షకు 6,547 మంది విద్యార్థులకు 6,499 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరయ్యారని డీఈవో యాదయ్య తెలిపారు. వార్షిక పరీక్షలు ముగియడంతో జిల్లాలోని వసతిగృహాల్లో చదివే విద్యార్థులు ఆనందంగా తల్లిదండ్రులతో కలిసి ఇంటిబాట పట్టారు.



విజయ సంకేతం చూపుతున్న విద్యార్థినులు

క్లుప్తంగా

రైతుపై అడవిపంది దాడి


గాయాలతో కిషన్

జన్నారం: అడవి పంది దాడిలో మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన రైతు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు చిరివేణి కిషన్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం పొనకల్ గ్రామ శివారులోని పంట పొలాలకు కిషన్ నీరు పెట్టేందుకు వెళ్లగా అడవిపంది ఒక్కసారిగా దాడి చేసింది. భయంతో కిషన్ కేకలు వేయగా సమీపంలో ఉన్న మరో వ్యక్తి రావడంతో అడవి పంది పారిపోయింది. దాడిలో కిషన్ కుడి భుజం, కుడి కన్ను కింద గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు జన్నారం ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

పాత గోదాంలో అగ్నిప్రమాదం

భైంసాటౌన్: పట్టణంలోని ఈసేవా కాంప్లెక్స్ సమీపంలో గల పాత గోదాంలో బుధవారం మంటలు చెలరేగాయి. గోదాం కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండగా చెత్తాచెదారం పేరుకుపోయింది. ప్రమాదవశాత్తు చెత్తకు నిప్పంటుకోగా దట్టమైన పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

పాఠశాలలో చోరీకి యత్నం


తరగతి గదిని పరిశీలిస్తున్న ఎస్సై

కడెం: మండలంలోని పెద్దూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలకు గత మూడు రోజులుగా సెలవులు ఉన్నాయి. సెలవు రోజుల్లో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోని రెండు తరగతి గదుల తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. పాఠశాలలో విలువైన సామగ్రి లేకపోవడంతో దొంగలు ఎక్కడివి అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. కాగా హెచ్‌ఎం ఫిర్యాదుతో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి బుధవారం పాఠశాలను పరిశీలించారు.

కీచక ఉపాధ్యాయులపై కేసు నమోదు

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో గత ఫిబ్రవరిలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన గణిత ఉపాధ్యాయుడు ఆలూరి మనోహర్ రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు సాయిని మోహన్‌రావులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసుతో పాటు బుధవారం అదనంగా ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ 1989ను నమోదు చేశారు. విచారణ అధికారిగా ఉన్న నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు పరారీలో ఉండగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మార్చి 8న మనోహర్‌రెడ్డిని, ఏప్రిల్ 1న మోహన్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ శివారులో పేకాట స్థావరంపై బుధవారం ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న వారిలో ముగ్గురు పారిపోగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. రూ.3,720 నగదు, రెండు మొబైల్ ఫోన్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొరవడిన పర్యవేక్షణ!

- అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు
- తూతూ మంత్రంగా ఉన్నతాధికారుల పరిశీలన
- విధుల్లో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న సిబ్బంది



ఇందన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరా

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలు తూతూ మంత్రంగా మారాయి. సీసీకెమెరాల నిర్వహణ చేపడుతున్నా ఉన్నతాధికారులు సీసీఫుటేజీలను పర్యవేక్షించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద డ్యూటీలో ఉన్న సిబ్బంది సంతకం చేసిన తర్వాత అక్కడే 24 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కానీ సంతకం చేసిన తర్వాత తమ సొంత పనుల కోసం వెళ్తున్నట్లు సమాచారం ఉంది. చెక్‌పోస్టుల వద్ద బీట్, సెక్షన్ అధికారులతో పాటు వాచర్లు కూడా విధులు నిర్వహిస్తుంటారు. అయితే వాచర్లకు బాధ్యతలు అప్పగించి అక్కడ డ్యూటీ చేసే ఇతర సిబ్బంది సొంత పనుల కోసం వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇలా పలు చెక్‌పోస్టుల్లో జరుగుతుండగా ఇటీవల ఉన్నతాధికారి గమనించి హెచ్చరించినట్లుగా సమాచారం. గతంలో పని చేసిన ఎఫ్‌డీవో మాధవరావు సీసీ కెమెరాల్లోనే సిబ్బంది పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హెచ్చరికలు జారీ చేయడంతో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదు. కానీ ప్రస్తుతం ఉన్నతాధికారులు సీసీకెమెరాలను పట్టించుకోకపోవడంతో సిబ్బందిపై పర్యవేక్షణ లేక ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

మూడేళ్ల క్రితం ఏర్పాటు..

జన్నారం అటవీ డివిజన్‌లో స్మగ్లింగ్ నిరోధించేందుకు, అధికారుల పనితీరు పర్యవేక్షించేందుకు మూడేళ్ల క్రితం చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీకెమెరాల ఏర్పాటుతో చెక్‌పోస్టుల వద్ద జరుగుతున్న వాహనాల తనిఖీలు, రాత్రి పూట వాహనాల ప్రవేశంతో పాటు చెక్‌పోస్టుల వద్ద పని చేస్తున్న సిబ్బంది పనితీరు పర్యవేక్షించేవారు. డివిజన్‌లోని ఇందన్‌పల్లి, కలమడుగు, తపాలపూర్ చెక్‌పోస్టుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు.

ఎన్నో ప్రయోజనాలు..

ప్రధాన రహదారిపై గల అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ప్రధాన రహదారిపై స్మగ్లింగ్‌కు తగ్గిపోవడంత పాటు అనుమానిత వాహనాలను గుర్తించే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో ఈ సీసీ కెమెరాలు సహకరిస్తాయి. ఇప్పటి వరకు పలు కేసుల పరిష్కారంలో పోలీసులు అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను పరిశీలించారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం..



జన్నారం డివిజన్‌లో నిఘా కోసం అటవీ చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. గతంలో కొంత పర్యవేక్షణ కొరవడింది. కానీ నేను విధుల్లో చేరినప్పటి నుంచి సీసీకెమెరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. సిబ్బంది పనితీరు కనిపెడుతున్నాం. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం.

– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

గంగిపల్లిలో వన్యప్రాణుల వేట

- ఉచ్చుకు బలైన చుక్కల దుప్పులు
- మాంసం విక్రయానికి యత్నం
- పట్టుకున్న అటవీశాఖ అధికారులు


చుక్కల దుప్పి మాంసంతో నిందితులను పట్టుకున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: అటవీప్రాంత సమీపంలో పంట పొలాలను కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చుకు వన్యప్రాణులు బలయ్యాయి. ఉచ్చుకు రెండు చుక్కల దుప్పులు మృత్యువాతపడగా వాటి మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. జైపూర్ మండలం గంగిపల్లి గ్రామ శివారులో గల పంట పొలాల్లో రైతులు అమర్చిన విద్యుత్ తీగలకు రెండు చుక్కల దుప్పులు మృతిచెందాయి. మాంసాన్ని విక్రయించేందుకు చిన్న ముక్కలుగా కోస్తుండగా గంగిపల్లి గ్రామానికి చెందిన పాలమాకుల శ్రీనివాస్‌రెడ్డి, గూడపాపన్నలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్ తెలిపారు. ఇద్దరిపై వన్యప్రాణుల చట్టం కింద కేసులు నమోదు చేశామన్నారు.

లాడ్జిలో దాడికి పాల్పడిన వ్యక్తులు అరెస్ట్



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస్ గార్డెన్ సమీపంలోని ఓ లాడ్జిలో ఈనెల 1న రాత్రి జరిగిన దాడి కేసులో బుధవారం ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఉషకోయల తరుణ్ తన బంధువులు శ్రావణ్, పర్వతాలు, శ్రీకాంత్, రేవంత్‌లు లాడ్జిలో రూమ్ తీసుకొని శ్రావణ్ కుటుంబ సమస్యపై మాట్లాడుకుంటున్నారు. ఇదే సమయంలో రేవంత్‌కు తెలిసిన వ్యక్తి అశోక్‌రోడ్‌కు చెందిన మురుమూరు సందీప్ తన స్నేహితులు తిగుళ్ల శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లు రేవంత్‌తో పాటు ఇతరులపై దాడిచేశారు. పాత గొడవల కారణంగా సందీప్ రేవంత్‌పై దాడి చేయగా శ్రీకాంత్, తరుణ్, పర్వతాలుకు తీవ్ర గాయాలయ్యాయి. తరుణ్ ఫిర్యాదు మేరకు సందీప్, శివకుమార్, అబ్దుల్ అఫ్రోజ్, నిఖిల్, వివేక్, అచ్యుత్, సాకేత్‌లపై కేసు నమోదు చేయగా శివకుమార్, సాకేత్, అఫ్రోజ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిఖిల్, వివేక్, అచ్యుత్, సందీప్‌లు పరారీలో ఉన్నారన్నారు.

న్యాయం చేయాలని గంగపుత్రుల నిరసన


నిరసన తెలుపుతున్న గంగపుత్ర కులస్తులు

నిర్మల్‌చైన్‌గేట్: లక్ష్మణచాంద మండలం నర్సాపూర్ డబ్ల్యూకు చెందిన గంగపుత్ర కులానికి చెందిన 10 కుటుంబాల వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కుల సంఘానికి సంబంధించిన లెక్కలు అడిగినందుకు సంఘం అధ్యక్షుడు పడగేల మహిపాల్ తమ కుటుంబాలను కుల బహిష్కరణ చేశారన్నారు. గత పది నెలలుగా కలెక్టర్, ఎస్పీలను కలిసి సమస్య పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి వచ్చిన పోలీసులు కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇచ్చి కులంలో చేరాలని సలహా ఇచ్చారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గైని మురళీమోహన్, హెచ్‌ఆర్పీ సంఘం అధ్యక్షుడు సురకంటి ఎల్లారెడ్డి, బాధిత గంగపుత్రులు పుట్టి భీమన్న, పుట్టి ఎర్రన్న ఉన్నారు.

నిరసనలో పాల్గొన్న ఎంపీ నగేశ్


నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సమీప ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఎదుట బుధవారం బీజేపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న జీహెచ్‌ఎంసీ మేయర్


మేయర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని బుధవారం జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మీ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మేయర్‌కు అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న మహాపోచమ్మ దేవాలయం, పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట నాయకులు గడ్డం అరవింద్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీస్


కౌన్సెలింగ్ ఇస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్

బాసర: గోదావరి నదిలో పిల్లలతో కలిసి దూకేందుకు యత్నించిన వ్యక్తికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నిజామాబాద్ జిల్లా బోయగల్లికి చెందిన కోమటి గంగప్రసాద్, భార్య లక్ష్మి నిజామాబాద్‌లోని బట్టల దుకాణంలో పని చేస్తుంటారు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు వర్షిణి, రషిత ఉన్నారు. కాగా కుటుంబ సమస్యల కారణంగా తన ఇద్దరు పిల్లలను తీసుకుని గంగప్రసాద్ బుధవారం బాసర మండల కేంద్రంలోని గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ గమనించి హుటాహుటిన వారి వద్దకు చేరుకున్నాడు. ఆత్మహత్యకు యత్నిస్తున్న గంగప్రసాద్‌ను అతని ఇద్దరి పిల్లలను దగ్గరికి తీసుకొని ఓదార్చాడు. గంగప్రసాద్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని అప్పగించారు. కాగా చాకచక్యంగా వ్యవహరించి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడిన కానిస్టేబుల్ మోహన్‌సింగ్‌ను ఎస్సై గణేశ్, ఇతర సిబ్బంది అభినందించారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి


చికిత్స పొందుతున్న కూలీలు

కోటపల్లి: మండలంలోని కొండంపేట గ్రామ సమీపంలో ఉపాధి హామీ పథకం కూలీలపై బుధవారం తేనెటీగలు దాడి చేశాయి. కూలీలు అటవీ ప్రాంతంలో పని ప్రదేశానికి వెళ్తుండగా ఒక్కసారిగా దాడి చేయడంతో పరుగులు తీశారు. తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు తలోవైపు పరుగు పెట్టారు. దాడిలో గ్రామానికి చెందిన లింగయ్య, బానయ్య, రాజు, సమ్మక్క, అంకమ్మ, బాపు స్వల్పంగా, పి.స్వరూప తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి బాధితులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యుడు సత్యనారాయణకు సూచించారు. దాడిలో కూలీల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


రవితేజ (ఫైల్)

తాండూర్: తన కంటిచూపు నయమవుతుందో లేదోననే బెంగతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తంగళ్లపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ తంగళ్లపల్లి గ్రామానికి చెందిన గోవిందుల కవిత– సత్యనారాయణల పెద్ద కుమారుడు రవితేజ (23) హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. తనకు కంటి సమస్య తగ్గిపోతుందో లేదోనని మానసికంగా వేదనకు గురై బుధవారం మధ్యాహ్నం తాను చనిపోతున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఇంటికి వచ్చేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడంతో హుటాహుటిన బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే రవితేజ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. యువకుడి మేనమామ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు

సోన్/నిర్మల్‌టౌన్: సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన వ్యక్తికి ఏడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.3000 జరిమానా విధిస్తూ నిర్మల్ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెల్లడించారు. కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం భీమన్న ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. 12, ఏప్రిల్, 2023న మధ్యాహ్నం గ్రామంలోని హోటల్‌లో కూర్చున్నాడు. అదే గ్రామానికి చెందిన కుడుకల పోశెట్టితో హోటల్ వద్ద గొడవ జరిగింది. దీంతో పోశెట్టి పక్కన ఉన్న పగిలిన బీర్‌సీసాతో భీమన్నను పొడిచాడు. వెంటనే అక్కడున్న వారు అడ్డుకోగా విషయం తెలుసుకున్న భార్య గంగామణి చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం సోన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపరిచారు. అడిషనల్ పీపీ రమణారావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి, నేరం రుజువు చేశారు. దీంతో జడ్జి పోశెట్టికి 7 సంవత్సరాల జైలుశిక్ష, రూ.3000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

జొన్న పంట దగ్ధం


దగ్ధమైన జొన్న పంటను చూపుతున్న రైతు

ముధోల్: ముధోల్‌కు చెందిన కోరి యోగేశ్‌కు చెందిన జొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... యోగేశ్ 10 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేశాడు. చేతికొచ్చిన జొన్న పంటను ఒకే చోటకు చేర్చి కుప్పలుగా పోశాడు. ఇటీవల వర్షం కురవడంతో రక్షణ కోసం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఉంచాడు. బుధవారం ఉదయం చేనుకు వచ్చే సరికి పంట కుప్పలు కాలిపోయి ఉన్నాయి. పంట కుప్పలు దగ్ధం కావడానికి గల కారణం ఎంటో తెలియడం లేదని బాధిత రైతు వాపోతున్నాడు. అప్పులు తెచ్చి పంట సాగు చేశానని అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

తెల్లకల్లు షాపుపై పోలీసుల దాడి

బేల: మండలంలోని జంగుగూడ (సైద్‌పూర్)లో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న తెల్లకల్లు షాపుపై మంగళవారం రాత్రి జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, బేల ఎస్సై దివ్యభారతిలు సిబ్బందితో కలిసి దాడి చేశారు. తెల్లకల్లు షాపులోని 400 లీటర్ల తెల్లకల్లును ధ్వంసం చేసి, రూ.3వేల నగదును సీజ్ చేసినట్లు వారు పేర్కొన్నారు. షాపు యజమాని బేలకు చెందిన సత్యనారయణ్ గౌడ్, షాపు నిర్వాహకుడు తుకారాంతో పాటు అక్రమషాపు నిర్వహణకు రూ.12లక్షలకు అనుమతి ఇచ్చిన వీడీసీ చైర్మన్ ఆత్రం రాముడుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మంచిర్యాల వాసి మృతి


విజయ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌కు చెందిన పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ భర్త విజయ్ (53) బుధవారం హైదరాబాద్ రింగురోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం విజయ్ తన అన్న కూతురు సోనిని అమెరికా పంపించేందుకు ఈనెల1న అన్నయ్య రాములు, వదిన విజయ, మరో స్నేహితుడితో కలిసి తన కారులో వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున తిరిగి వస్తుండగా రింగ్‌రోడ్డుపై కంటైనర్ లారీ ఢీకొనడంతో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నయ్య రాములుకు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా రాములు భార్య విజయ తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోనే చికిత్స పొందుతోంది. విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

భార్య, అత్తపై దాడి.. వ్యక్తి అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

తాండూర్: భార్య, అత్తను చితకబాది గాయపర్చిన కేసులో ఓ వ్యక్తిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామపంచాయతీ కొమ్ముగూడెం గ్రామానికి చెందిన దాగం మల్లేశ్ గతనెల 16న మద్యం తాగి భార్య లావణ్యతో గొడవ పడ్డాడు. లావణ్యపై దాడి చేయడానికి సిద్ధపడగా అత్త రాజు అడ్డుపడింది. కోపోద్రిక్తుడైన మల్లేశ్ గరిటెతో ఇరువురు తలలపై బలంగా కొట్టి గాయపర్చాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

నేరడిగొండ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిర్మల్ వైపు గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి బుధవారం బంధం ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు చేపట్టగా నేరడిగొండ మండలం వాంకిడి గ్రామానికి చెందిన షేక్ మజార్, నిర్మల్ జిల్లాకు చెందిన షేక్ ఇమ్రాన్ అనే ఇద్దరు వ్యక్తుల వద్ద 150 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. వారిని విచారించగా నేరడిగొండ మండలంలోని ధన్నూర్(డి) గ్రామానికి చెందిన కాటరే తారాసింగ్ వద్ద నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు తేలిందన్నారు.

వ్యక్తి రిమాండ్

బజార్‌హత్నూర్: గంజాయితో ఉన్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మోర్కండి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి పోలీస్‌పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గులాబ్‌తండా గ్రామపంచాయతీ పరిధి ఇంద్రనగర్ గ్రామానికి చెందిన ఆడే రాజ్‌కుమార్ అనుమానాదస్పదంగా కన్పించాడు. అతడిని తనిఖీ చేయగా అతని వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. వెంటనే రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. బుధవారం బోథ్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకే పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న ఆత్రం సుగుణ

నార్నూర్: రాజ్యాంగ పరిరక్షణకే జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని పూసిగూడ గ్రామం నుంచి జిల్లా కోఆర్డినేటర్ ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్‌తో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ దేశంలో నియంతృత్వ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రజలతో, కార్యకర్తలతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోఖండే దేవురావు, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద నాయక్, మాజీ ఎంపీటీసీ పరమేశ్వర్, మహిళ నాయకురాలు బానోత్ ప్రణీత, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ కోర్శెళ్ల మహేందర్, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా ఉపాధ్యక్షుడు నసీర్ తదితరులు ఉన్నారు.

ప్లాట్ల పంపిణీకి కృషి


మాట్లాడుతున్న ఆర్డీవో, అధికారులు

కాసిపేట: నిర్వాసితులకు పది రోజుల్లో పునరావాస కాలనీలో ప్లాట్ల పంపిణీతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు చెల్లించేలా కృషి చేస్తామని బెల్లంపల్లి ఆర్‌డీవో హరికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని ఓపెన్‌కాస్టు నిర్వాసిత దుబ్బగూడెం గ్రామస్తులతో సింగరేణి అధికారులతో కలిసి పునరావాస కాలనీలో సమావేశం నిర్వహించారు. కాలనీలో జరుగుతున్న పనుల్లో జాప్యం ఇతర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులతో సంబంధం లేకుండా ఈనెల 11న ప్లాట్ల కేటాయింపు అనంతరం నిర్వాసితులు నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. ఎస్‌ఓటూ జీఎం విజయప్రసాద్, సివిల్ ఎస్ఈ రాము, ఎస్టేట్ అధికారిణి నవనీత, దుబ్బగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.